క్లుప్తంగా

25న జేసీఐ చైతన్యం-2025 సదస్సు



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న జేసీఐ సభ్యులు

అల్లిపురం: జేసీఐ ఆధ్వర్యంలో 14 నుంచి 40 ఏళ్ల మధ్య వయసు వారికి లక్ష్య సాధనలో మెళకువలపై దిశానిర్దేశం చేసేలా జేసీఐ ప్రత్యేక సదస్సు చైతన్యం–2025ను నిర్వహించనున్నట్లు జోన్4 వైస్ ప్రెసిడెంట్ చైతన్య, వైజాగ్ అచీవర్స్ ప్రెసిడెంట్ డాక్టర్ సోమశేఖర్, చైతన్యం కాన్ఫరెన్స్ డైరెక్టర్ డా.శీతల్ తెలిపారు. ఈ నెల 25న సాయిప్రియ రిసార్ట్స్‌లో ఉదయం 10 నుంచి సాయంత్రం 6 వరకు జరిగే ఈ కార్యక్రమ వివరాలను డాబాగార్డెన్స్‌లోని ఓ హోటల్లో సోమవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో వెల్లడించారు. దశాబ్ది కాలానికి పైగా జేసీఐ సామాజిక బాధ్యతతో వ్యక్తిత్వ, సంస్థాగత అభివృద్ధితోపాటు వ్యాపార విస్తరణ అవకాశాలపై విస్తృతస్థాయి సదస్సుల ద్వారా యువతకు అండగా నిలుస్తోందన్నారు. దీంతోపాటు జేసీఐ జోన్ 4 రీజియన్, సభ్యుల విజయాలు, లక్ష్యాలు తదితర అంశాలపై చర్చిస్తామన్నారు.

అసంపూర్తి పనులతో అవస్థలు



పలకలు వేయని డ్రైనేజీ, రోడ్డుపై వదిలేసిన ఇసుక

అల్లిపురం: జీవీఎంసీ 33వ వార్డు వెంకటేశ్వర మెట్ట వద్ద అసంపూర్తి పనులతో స్థానికులు ఇబ్బంది పడుతున్నారు. ఈ ప్రాంతంలో కాల్వ నిర్మించి పది రోజులైనా, కాల్వపై పలకలు ఏర్పాటు చేయకపోవడంతో రాకపోకలకు అవస్థలు పడుతున్నామని స్థానికులు తెలిపారు. రాత్రి సమయంలో అత్యవసరమైతే ఇంటి ముందుకు ఆటో కూడా వచ్చే పరిస్థితి లేదన్నారు. పని జరిగి పదిరోజులు పూర్తయినా నేటికి రోడ్డుపై ఇసుక తొలగించక పోవటంతో వాహనచోదకులు జారి పడి గాయాల పాలవుతున్నారని తెలిపారు. జీవీఎంసీ సిబ్బంది స్పందించి ఇసుకను తొలగించి, కాలువపై పలకలు వేయాలని కోరుతున్నారు.

జైల్‌లో పటిష్ట రక్షణ చర్యలు

ఆరిలోవ: విశాఖ కేంద్ర కారాగారంలో భద్రతను మరింత కట్టుదిట్టం చేస్తున్నారు. ఖైదీల కదలికలను నిరంతరం పర్యవేక్షించేందుకు సీసీ కెమెరాల సంఖ్యను పెంచుతున్నట్లు జైలు సూపరింటెండెంట్ ఎం.మహేష్‌బాబు తెలిపారు. గతంలో 9 సీసీ కెమెరాలు ఉండగా, ప్రస్తుతం అదనంగా 32 కెమెరాలు ఏర్పాటు చేయడంతో 41 కెమెరాలు పనిచేస్తున్నాయి. జైలు విస్తీర్ణం దృష్ట్యా మరో 300 సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని ఉన్నతాధికారులకు ప్రతిపాదనలు పంపినట్లు ఆయన వెల్లడించారు. ప్రస్తుతం ఉన్న కెమెరాల పుటేజీలను నిరంతరం పరిశీలిస్తూ ఖైదీల ప్రవర్తనను గమనిస్తున్నామని, ఇటీవల ఒక ఖైదీ షేవింగ్ కిట్ దాచడం సీసీ కెమెరాల ద్వారా గుర్తించి స్వాధీనం చేసుకున్నామని ఆయన తెలిపారు. జైలులో పూర్తిస్థాయి రక్షణ చర్యలు ఏర్పాటు చేస్తామని సూపరింటెండెంట్ పేర్కొన్నారు.

రౌడీమూకల దాడిపై కేసు



బీరు బాటిల్స్ విసురుతున్న రౌడీ మూకలు

ఎంవీపీకాలనీ: లాసన్స్ బే కాలనీ శాంతి ఆశ్రమం భూముల్లో రౌడీ మూకల దాడికి సంబంధించిన వీడియో వైరల్ అయింది. కొన్నేళ్లుగా అక్రమంగా వినియోగించుకుంటున్న కొందరు గత నెలలో ఆ భూములను శాంతి ఆశ్రమానికి అప్పగించారు. సుదీర్ఘ న్యాయ పోరాటం తర్వాత ఆశ్రమం యాజమాన్యం భూమిని దక్కించుకున్నప్పటికీ, ఆక్రమణదారుల ఆగడాలు కొనసాగుతున్నాయి. ఇటీవల ఆ భూముల్లో పనిచేస్తున్న ఆశ్రమానికి చెందిన వారిపై ఆక్రమణదారుడు సిద్ధార్థ్ పంపిన రౌడీ మూకలు రాళ్లు, బీర్ బాటిళ్లతో దాడి చేశారు. జాలరిపేట శ్మశానవాటిక రోడ్డు వైపు నుంచి ఆశ్రమానికి అప్పగించిన భూముల్లో పనులు చేస్తున్న వారిపై దాడి చేస్తున్న వీడియో వైరల్ అయింది. ఈ ఘటనపై ఆశ్రమం ప్రతినిధులు ఈ నెల 15న ఫిర్యాదు చేయగా, ఎంవీపీ పోలీసులు సిద్ధార్థ్‌తో పాటు రౌడీ మూకలపై కేసు నమోదు చేశారు. వీడియోలో ఉన్నవారిని పోలీస్ స్టేషన్‌కు పిలిపించి బైండోవర్ చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

పాతనగర వాసులు కాలుష్య సెగతో ఉక్కిరిబిక్కిరవుతున్నారు. ఒకవైపు పోర్టు కాలుష్యం.. ఇంకో వైపు వాహనాల కారణంగా వాయుకాలుష్యం.. మరోవైపు శబ్ద కాలుష్యంతో సతమతమవుతున్నారు. తరచూ అనారోగ్యాల బారిన పడుతున్నారు. కాలుష్య నివారణకు అధికారులు సత్వర చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నారు.



కాలుష్య పగ.. ట్రాఫిక్ సెగ..

- ఓ వైపు పోర్టు కాలుష్యం
- మరోవైపు వాయు, శబ్ద కాలుష్యాలు
- పాతనగర వాసుల అవస్థలు



దుమ్ము, ధూళిలో చిక్కుకున్న పాతనగరం



నియోజకవర్గంలో పోర్టు, పలు పరిశ్రమల కాలుష్యం

డాబాగార్డెన్స్: నగరం విస్తరిస్తోంది. మున్సిపాలిటీ గ్రేటర్‌గా అవతరించింది. గ్రేటర్ నుంచి స్మార్ట్‌సిటీ అయ్యింది. ఇప్పుడు మెట్రోసిటీ దిశగా పరుగులు తీస్తోంది. పెరుగుతున్న జనాభాతో పాటు వాహనాల సంఖ్య గణనీయంగా పెరుగుతోంది. వేలల్లో ఉన్న వాహనాలు లక్షల్లోకి చేరాయి. ట్రాఫిక్ విపరీతంగా పెరగడంతో నగర రహదారుల్లో ఎక్కడికక్కడ పద్మవ్యూహం వంటి పరిస్థితి నెలకొంటోంది. వాహనాల నుంచి వెలువడే కాలుష్యం నగరవాసి జీవితాన్ని విషతుల్యం చేస్తోంది. శబ్ద కాలుష్యం సైతం అదే స్థాయిలో పెరుగుతోంది.

ట్రాఫిక్ పద్మవ్యూహం

ఉదయం నుంచి రాత్రి పొద్దుపోయే వరకు ప్రధాన కూడళ్లలో వాహనాల రద్దీతో ఎక్కడికక్కడ ట్రాఫిక్ నిలిచిపోతోంది. ట్రాఫిక్‌లో ఓసారి ఇరుక్కుంటే బయటపడడం కష్టతరమవుతోంది. నియోజకవర్గంలో జగదాంబ జంక్షన్, పూర్ణామార్కెట్, దుర్గాలమ్మ గుడి జంక్షన్, డాబాగార్డెన్స్ మెయిన్‌రోడ్డు, సీఎంఆర్ జంక్షన్ ఏరియా, జిల్లా పరిషత్ జంక్షన్, ఆర్టీసీ కాంప్లెక్స్ ఏరియా, ద్వారకానగర్‌తో పాటు పలు జంక్షన్లు ఉన్నాయి. ఈ ప్రధాన జంక్షన్లలో ట్రాఫిక్ నుంచి తప్పించుకుని బయటపడాలంటే వాహనచోదకులు చుక్కలు చూస్తున్నారు.

ప్రధాన కేంద్రం.. దక్షిణమే..

నగర జనాభా సుమారు 25 లక్షలు ఉండగా.. ఇతర ప్రాంతాల నుంచి రాకపోకలు సాగించే వారు కూడా వేలల్లో ఉంటారు. దాంతో వాహనాల రద్దీ నానాటికీ పెరుగుతోంది. ముఖ్యంగా నగరంలో దక్షిణ నియోజకవర్గంతో నగర, జిల్లా పరిపాలన అంతా ముడిపడి ఉంది. దీంతో ఏ పనికోసమైనా ఇక్కడికే వస్తుంటారు. పెరుగుతున్న వ్యక్తిగత వాహనాలతో సమస్య మరీ జటిలమవుతోంది.

ఇరుకు రోడ్లలో ఇక్కట్లు

పాతనగరం రోడ్లు విస్తరించినా వాహనాల రద్దీ కూడా అదే రీతిలో పెరిగింది. జగదాంబ జంక్షన్ నుంచి కురుపాం మార్కెట్ వరకు నిత్యం వేల సంఖ్యలో వాహనాలు రాకపోకలు సాగిస్తున్నాయి. వాహనాల సంఖ్య అధికమవడంతో ట్రాఫిక్ సమస్య తలెత్తుతోంది.

శ్వాసకోశ వ్యాధులతో సతమతం

అసలే పోర్టు కాలుష్యంతో సతమతమవుతున్న పాతనగర ప్రజలు ఇప్పుడు కొత్తగా వాహనాల వల్ల వాయు కాలుష్యానికి గురవుతున్నారు. పాతనగరంలోని అత్యధిక శాతం మంది శ్వాసకోశ వ్యాధులతో బాధపడుతున్నారు.

ప్రభుత్వాలు స్పందించాలి


నగరంలో అనేక ప్రాంతాల్లో రాన్రాను గాలి, నీరు నిర్దేశిత నాణ్యత ప్రమాణాల కన్నా తక్కువ స్థాయికి పడిపోతున్నాయి. అధిక సంఖ్యలో వాహనాల రాకపోకల కారణంగా రోడ్లు, బహిరంగ ప్రదేశాలు శబ్ద కాలుష్యంతో నిండిపోవడం సర్వసాధారణంగా మారింది. ఆటోమొబైల్ ఉద్గారాల వల్ల గాలి కలుషితమవుతోంది. భూగర్భ జలాలు కూడా అదే విధంగా ఉన్నాయి. కాలుష్య నియంత్రణకు ప్రభుత్వం ప్రత్యామ్నాయ చర్యలు చేపట్టాలి.

– మంత్రి శ్యాంప్రసాద్, కార్యదర్శి, హ్యూమన్ రైట్స్ కౌన్సిల్

పాత వాహనాలతో పెరుగుతున్న కాలుష్యం

పాతవాహనాలు మరమ్మతు చేసి మళ్లీ ఉపయోగిస్తూ ఉండడంతో కాలుష్య తీవ్రత పెరుగుతోంది. మరమ్మతులు చేసే దుకాణాలు అల్లిపురం, నేరేళ్లకోనేరు, చావులమదుం, గోకుల్ థియేటర్ రోడ్డు బౌడరారోడ్డు తదితర ప్రాంతాల్లో ఎక్కువగా ఉన్నాయి. దీంతో ఈ ప్రాంత వాసులు కాలుష్యంతో సతమతమవుతున్నారు. ప్రధానంగా నేరేళ్ల కోనేరు, గోకుల్ థియేటర్ ఏరియా, చావుల మదుం ప్రాంతాల్లో ఆటో టింకరింగ్, రీబిల్డింగ్ పనులు, పెయింటింగ్ పనుల వల్ల ఇబ్బంది పడుతున్నామని స్థానికులు చెబుతున్నారు.

మండే.. ట్రాఫిక్‌జామ్ డే!







సోమవారం వస్తే చాలు.. కలెక్టరేట్ నుంచి కేజీహెచ్ డౌన్ వరకు ట్రాఫిక్ రద్దీ సర్వసాధారణమైపోయింది. వివిధ సమస్యలపై కలెక్టరేట్‌కు వచ్చే సాధారణ ప్రజలు, కేజీహెచ్‌కు వచ్చే రోగులతో ఆ రహదారులు కిక్కిరిసిపోతున్నాయి. ట్రాఫిక్ రద్దీని నియంత్రించాల్సిన పోలీసులు కేజీహెచ్ డౌన్‌లో చలానాలు రాయడంపై దృష్టి పెడుతున్నారు తప్ప.. ట్రాఫిక్ క్రమబద్ధీకరణపై కనీస చర్యలు తీసుకోకపోవడం గమనార్హం.

– ఫొటోలు: సాక్షి ఫొటోగ్రాఫర్, విశాఖపట్నం

ప్రజా ఫిర్యాదులకు తక్షణ పరిష్కారం



అర్జీదారుల సమస్యలు తెలుసుకుంటున్న జోన్-5 కమిషనర్ రాము

కంచరపాలెం: జ్ఞానాపురంలోని జీవీఎంసీ జోన్-5 కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమానికి నాలుగు వినతులు అందినట్లు జోనల్ కమిషనర్ బోడ్డేపల్లి రాము తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టౌన్ ప్లానింగ్‌కు 02, పబ్లిక్ హెల్త్‌కు 01, మంచినీటి విభాగానికి 01 చొప్పున అర్జీదారులు వినతిపత్రాలు అందజేసినట్లు చెప్పారు. ప్రజా ఫిర్యాదులను తక్షణం పరిష్కరించాలని సంబంధిత అధికారులను జెడ్సీ ఆదేశించారు. కార్యక్రమంలో రెవెన్యూ ఆర్‌వోలు బాబూరావు, రాజ్యలక్ష్మి, ఇంజినీరింగ్ ఈఈ తారా ప్రసన్నరెడ్డి, ఏపీడీవోలు కృపానందం, పుణ్యవతి, విద్యుత్ దీపాల ఏఈ అర్చన, టౌన్ ప్లానింగ్ ఏసీపీ శాస్త్రి, టీపీవో ప్రవీణ్, సర్వేయర్ లీలావతి, మంచినీటి విభాగం డీఈ సతీష్, ఏఈ సుమన్ పాల్గొన్నారు.

కనకమహాలక్ష్మికి అష్టదళ పద్మారాధన నేడు

డాబాగార్డెన్స్: విశాఖ వాసుల ఆరాధ్యదైవం కనక మహాలక్ష్మి అమ్మవారికి 108 స్వర్ణ పుష్పాలతో మంగళవారం అష్టదళ పద్మారాధన నిర్వహించనున్నారు. ఉదయం 7 నుంచి 8 గంటల వరకు నిర్వహించనున్న ఈ ప్రత్యేక పూజలో పాల్గొనదలచే భక్తులు రూ.1,116 చెల్లించి పేర్లు నమోదు చేసుకోవాలి. వివరాలకు 0891–2711725, 2566514 నంబర్లకు ఫోన్ చేయవచ్చు. భక్తులు యూనియన్ బ్యాంక్ అకౌంట్ నెంబరు 060810011006681 టౌన్‌కొత్త రోడ్డు బ్రాంచ్, ఐఎఫ్‌ఎస్‌సీ కోడ్ యూబీఐఎన్ 0806081కు ఆన్‌లైన్ పేమెంట్ చేసి, పేరు, గోత్రం తెలిపితే వారి పేరిట పూజ చేస్తారు.

సుందరయ్య స్ఫూర్తితో పోరాటాలకు సిద్ధం కండి



పుచ్చలపల్లి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న సీపీఎం నేతలు తపన్ సేన్, సీహెచ్ నరసింగరావు తదితరులు

అల్లిపురం: కమ్యూనిస్టు పార్టీ ఉద్యమ నిర్మాత, తొలి ప్రధాన కార్యదర్శి పుచ్చలపల్లి సుందరయ్య 40వ వర్ధంతిని జగదాంబ సిటు కార్యాలయంలో సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఎం పొలిట్ బ్యూరో సభ్యులు తపన్ సేన్, సిటు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సీహెచ్ నరసింగరావు తదితరులు పుచ్చలపల్లి చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ దేశం గర్వించదగ్గ మహోన్నత వ్యక్తి సుందరయ్య అని కొనియాడారు. దేశంలో భూ పంపిణీ జరగాలని, దున్నే వారికే భూమి నినాదంతో తెలంగాణా సాయుధ పోరాటం జరిపిన వ్యక్తి అని పేర్కొన్నారు. భూస్వామ్య కుటుంబంలో పుట్టినా నిరంతరం పేదల పక్షాన పోరాడారని తెలిపారు. పార్లమెంటులో తొలి ప్రతిపక్ష నేతగా ఉంటూ ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేశారని కొనియాడారు. ఆయన ఆశయ సాధన కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. అందరికీ విద్య, వైద్యం, తినడానికి తిండి, ఉండడానికి ఇల్లు, చేయడానికి పని కల్పించేలా ప్రభుత్వంపై పోరాడాలన్నారు. కార్యక్రమంలో సిటు జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్‌కేఎస్‌వీ కుమార్, పి.మణి, ఎం.సుబ్బారావు, కుమార మంగళం, పి.రాజు, పోలేశ్వరరావు, సూరీడు, పి.వెంకటరావు, చంద్రమౌళి, శేఖర్, శివ, గణేష్, రమణ తదితరులు పాల్గొన్నారు.

జర్నలిస్ట్ సాధిక్‌కు వాసుపల్లి ఆర్థిక సాయం



జర్నలిస్ట్‌కు ఆర్థిక సాయం అందిస్తున్న వాసుపల్లి

డాబాగార్డెన్స్: గైనిక్ సమస్యతో బాధపడుతున్న స్థానిక పాత్రికేయుడు సాధిక్ భార్య ఎండీ రషీదా బేగం వైద్య ఖర్చుల నిమిత్తం మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ దక్షిణ నియోజకవర్గ సమన్వయకర్త వాసుపల్లి గణేష్‌కుమార్ రూ.5 వేలు ఆర్థిక సాయం అందించారు. ఆశీల్‌మెట్ట సమీపాన వాసుపల్లి కార్యాలయంలో సోమవారం ఈ మొత్తాన్ని సాధిక్‌కు అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వంలో జగన్‌మోహనరెడ్డి అర్హులైన జర్నలిస్టులకు అక్రిడిటేషన్లు మంజూరు చేసి, ఇళ్ల స్థలాలకు రిజిస్ట్రేషన్ల ప్రక్రియ కూడా చేశారన్నారు. చంద్రబాబు గతంలో మాదిరే అధికారంలోకి వచ్చాక పాత్రికేయుల్ని చులకనగా చూస్తున్నారని ఆక్షేపించారు. అధికారం చేపట్టి ఏడాది కావస్తున్నా జర్నలిస్టులకు అక్రిడిటేషన్లు ఇవ్వలేని దుస్థితిలో కూటమి ప్రభుత్వం ఉందని ఎద్దేవా చేశారు. జర్నలిస్టులందరికీ ఇళ్ల స్థలాలు మంజూరు చేసి, అక్రిడిటేషన్లు, హెల్త్‌కార్డులతో పాటు వారి పిల్లలకు ఉచిత కార్పొరేట్ విద్య, బీమా, సీనియర్ పాత్రికేయులకు పెన్షన్లు అందించి అండగా నిలవాలన్నారు.

చెత్తను పారిశుధ్య కార్మికులకు అందించాలి

జోన్-4 జెడ్సీ మల్లయ్యనాయుడు



కొబ్బరితోటలో చెత్త సేకరణను పరిశీలిస్తున్న జెడ్సీ మల్లయ్యనాయుడు

జగదాంబ: ఇళ్లలో వ్యర్థాలను రోడ్డుపై వేయవద్దని, సేకరణకు వచ్చిన పారిశుధ్య కార్మికులకు అందించాలని జీవీఎంసీ జోన్-4 జెడ్సీ ఎం.మల్లయ్యనాయుడు సూచించారు. జోన్ పరిధిలోని 34వ వార్డులో కొబ్బరితోట, రామకృష్ణ జంక్షన్ ప్రాంతాల్లో సోమవారం పర్యటించిన ఆయన చెత్త సేకరణను పరిశీలించారు. ఈ సందర్భంగా జెడ్సీ మాట్లాడుతూ వార్డుల్లో వీధులు పరిశుభ్రంగా లేవని అసహనం వ్యక్తం చేశారు. ఎక్కడా చెత్తపోగులు లేకుండా శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, సెక్రటరీలు కలసి సిబ్బందితో చెత్తను ఎత్తించి, యార్డుకు తరలించేలా చర్యలు తీసుకోవాలన్నారు. లేకుండా వార్డు శానిటరీ ఇన్‌స్పెక్టర్లపై చర్యలు తీసుకుంటామన్నారు. ప్రజలు కూడా ఇంటి వద్దే డస్ట్‌బిన్‌లలో చెత్త ఉంచి, క్లాప్ వాహనాలకు అందించాలని సూచించారు.

బోరవానిపాలెంలో ప్రభుత్వ స్థలాల ఆక్రమణపై ఫిర్యాదు



కలెక్టర్ కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేస్తున్న పట్నాల రమాదేవి, వెంకటేశ్వరరావు

మహారాణిపేట: బోరవానిపాలెం గ్రామంలో గెడ్డను ఆనుకొని ఉన్న సర్వే నం.101లో అక్రమ కట్టడాలపై దర్యాప్తు చేయాలని గ్రామస్తురాలు పట్నాల రమాదేవి డిమాండ్ చేశారు. కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన పీజీఆర్‌ఎస్‌లో ఏఐటీయూసీ రాష్ట్ర నాయకుడు తెడ్డు వెంకటేశ్వరరావుతో కలసి ఫిర్యాదు చేశారు. వారు మాట్లాడుతూ ప్రభుత్వ స్థలం, అంగన్‌వాడీ భవనం, స్కూల్ భవనాలను ఆనుకొని ఉన్న కొన్ని స్థలాలను కొందరు పెద్ద మనుషుల ముసుగులో ఆక్రమించి, నిర్మాణాలు చేపడుతున్నారని పేర్కొన్నారు. ఈ కట్టడాల కోసం ప్రస్తావించిన వారిపై దాడులు చేస్తూ భయభ్రాంతులకు గురి చేస్తున్నారని పేర్కొన్నారు. గ్రామంలో పెద్దమనిషిగా ఉన్న ఒక వ్యక్తి అక్కడి ప్రభుత్వ స్థలాలను అమ్ముతూ డబ్బులు చేసుకుంటున్నారని, వీరికి కొంతమంది రెవెన్యూ అధికారులు వత్తాసు పలుకుతున్నారని వెంకటేశ్వరరావు అన్నారు. గతంలోనూ దీనిపై ఫిర్యాదు చేశామని, కొందరు రెవెన్యూ అధికారులు సమస్యను తప్పుదారి పట్టిస్తున్నారని రమాదేవి ఆరోపించారు. అనంతరం కలెక్టర్‌కు వినతి పత్రం సమర్పించారు.

రాష్ట్రంలో అభివృద్ధి.. సంక్షేమం శూన్యం



అన్నదాన కార్యక్రమం ప్రారంభిస్తున్న వాసుపల్లి

డాబాగార్డెన్స్: పేదవాడిని మరింత పేదవాడిగా మార్చే కూటమి ప్రభుత్వ ఆలోచనా విధానం మారకపోతే తగు మూల్యం చెల్లించుకోక తప్పదని మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ దక్షిణ నియోజకవర్గ సమన్వయకర్త వాసుపల్లి గణేష్‌కుమార్ హెచ్చరించారు. పార్టీ నాయకులు దశమంతుల మాణిక్యాలరావు, దశమంతుల వేణుగోపాల్ ఆధ్వర్యంలో సోమవారం పాతనగరం స్వయంభూ కాశీవిశ్వేశ్వర శివ పంచాయతన దేవాలయంలో చేపట్టిన అన్నసమారాధనను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమం శూన్యంగా మారిందన్నారు. నిధులన్నీ అమరావతిలో పెడుతున్న చంద్రబాబు పేదల బతుకుల్ని అథోగతి పాల్జేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో పార్టీ ముఖ్య నాయకులు నీలాపు సర్వేశ్వరరెడ్డి, పీతల వాసు, ముత్తాబత్తుల రమేష్, తాడి రవితేజ, వడ్డాది దిలీప్, ఆకుల శ్యామ్, సూర్యనాయుడు, దశమంతుల రామలక్ష్మి, రాము, ఆలయ ధర్మకర్తలు, సభ్యులు, పార్టీ వార్డు నాయకులు పాల్గొన్నారు.

నిషేధిత ప్లాస్టిక్ వినియోగిస్తే కఠిన చర్యలు

- ఏఎంహెచ్‌వో కృష్ణంరాజు
- పూర్ణామార్కెట్‌లో దాడులు



పూర్ణామార్కెట్ వద్ద దుకాణాల్లో తనిఖీ చేస్తున్న జీవీఎంసీ ఏఎంహెచ్‌వో కృష్ణంరాజు తదితరులు

జగదాంబ: నిషేధిత ప్లాస్టిక్ కవర్లు వినియోగిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని జీవీఎంసీ ఏఎంహెచ్‌వో కృష్ణంరాజు హెచ్చరించారు. జీవీఎంసీ 35వ వార్డు పూర్ణామార్కెట్‌లో నిషేధిత ప్లాస్టిక్ కవర్లు ఉపయోగిస్తున్న వ్యాపార సముదాయాలపై పబ్లిక్ హెల్త్ అధికారులతో కలసి సోమవారం ఆయన దాడులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఎంహెచ్‌వో మాట్లాడుతూ మానవాళికి హాని కలిగించే నిషేధిత ప్లాస్టిక్‌పై జీవీఎంసీ నిషేధం విధించిందన్నారు. అయినప్పటికీ వ్యాపారులు ప్లాస్టిక్ ఉపయోగిస్తూనే ఉన్నారన్నారు. చిరు వ్యాపారుల వద్ద ఎక్కువగా ఈ కవర్లు ఉంటున్నాయని చెప్పారు. హోల్‌సేల్ దుకాణాలపై తరచూ దాడులు చేయడానికి ప్రణాళిక సిద్ధం చేశామన్నారు. దుకాణాల్లో ప్లాస్టిక్ కవర్లు దొరికితే వెంటనే ఆయా దుకాణాల ట్రేడ్ లైసెన్సులు రద్దు చేయడంతో పాటు అపరాధ రుసుములు విధిస్తామని తెలిపారు. పూర్ణామార్కెట్‌లో 30 కేజీలు ప్లాస్టిక్ కవర్లు స్వాధీనం చేసుకుని, రూ.10వేలు అపరాధ రుసుము విధించామని తెలియజేశారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి ఇన్‌స్పెక్టర్ మురళి, సిబ్బంది పాల్గొన్నారు.

స్మృత్యంజలి పార్కు వద్ద స్వల్ప ఉద్రిక్తత

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ కార్మికులు, కాంట్రాక్ట్ కార్మికుల సమ్మె నేపథ్యంలో సోమవారం సాయంత్రం ఉక్కు స్మృత్యంజలి పార్కు వద్ద స్వల్ప ఉద్రిక్తత చోటుచేసుకుంది. ఈ సందర్భంగా నాయకులు, పోలీసుల మధ్య వాగ్వాదం జరిగింది. స్టీల్‌ప్లాంట్ సమ్మె నేపథ్యంలో సోమవారం సాయంత్రం గేటు వద్ద బహిరంగ సభ నిర్వహించాలని నాయకులు సన్నాహాలు చేశారు. పోలీసులు బహిరంగ సభకు అనుమతి నిరాకరించారు. దీంతో సమ్మె జయప్రదం చేయాలని కార్మికులకు చెబుదామని నాయకులు రోడ్డు ఇరువైపులా ఉండి అప్పీలు చేయసాగారు. ఈలోగా అక్కడకు పెద్ద ఎత్తున పోలీసులు చేరుకుని నాయకులను నిలవరించే ప్రయత్నించారు. ఈ ప్రయత్నంలో ఇరు వర్గాల మధ్య వాగ్వాదం జరిగింది. నాయకులు ఆదినారాయణ, కె.ఎస్.ఎన్.రావుతో పాటు కొంత మందిని అదుపులోకి తీసుకుని పోలీస్ స్టేషన్‌కు తరలించారు. దీంతో కార్మికులు పోలీసులకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. అక్కడ స్వల్ప ఉద్రిక్తతకు దారి తీసింది. శాంతియుతంగా ప్రచారం చేస్తున్న తమతో పోలీసులు వ్యవహరించిన తీరును నిరసిస్తూ కార్మికులు బైఠాయించారు. సౌత్ ఏసీపీ టి.త్రినాథ్ నాయకులకు నచ్చచెప్పి అక్కడ నుంచి పంపించేశారు.

పోలీసుల తీరు సరికాదు

సమ్మె ప్రాధాన్యతపై ప్రచారం చేసుకునే అవకాశం కూడా లేకుండా పోయిందని సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిహెచ్.నర్సింగరావు, 78వ వార్డు కార్పొరేటర్ బి.గంగారావు ఆందోళన వ్యక్తం చేశారు. కార్మిక నాయకులపై పోలీసులు దురుసుగా ప్రవర్తించారని పేర్కొన్నారు. ఉద్యమాలను పోలీసులచే అణగదొక్కాలని చూస్తే తీవ్ర పరిణామాలు ఉంటాయని హెచ్చరించారు.

రైల్వేస్టేషన్‌లో డీఆర్‌ఎం తనిఖీలు



రైల్వేస్టేషన్‌లో తనిఖీలు నిర్వహిస్తున్న డీఆర్‌ఎం లలిత్ బోరా

తాటిచెట్లపాలెం: వాల్తేర్ డివిజన్ డివిజనల్ రైల్వే మేనేజర్ (డీఆర్‌ఎం) లలిత్ బోరా సోమవారం విశాఖ రైల్వేస్టేషన్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన ప్రయాణికుల సౌకర్యాలు, స్టేషన్ పరిశుభ్రత, కోచ్‌ల నిర్వహణ, ప్రయాణికుల రద్దీ వంటి అంశాలను క్షుణ్ణంగా పరిశీలించారు. డీఆర్‌ఎం ప్రయాణికులు వేచి ఉండే ప్రదేశాలు, సాధారణ టికెట్ బుకింగ్ కౌంటర్లు, పాదచారుల వంతెనలు, ఎస్కలేటర్లు, లిఫ్టులు, ప్లాట్‌ఫారాలు, పార్కింగ్ సదుపాయాలు, బెడ్‌రోల్ నిర్వహణ, క్యాటరింగ్ స్టాల్స్‌తో పాటు 'ఒక స్టేషన్ – ఒక ఉత్పత్తి' స్టాల్‌ను సందర్శించారు. ఆయన ఆయా స్టాల్స్‌లోని విక్రయదారులతో ముఖాముఖి మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. ఈ తనిఖీలో డీఆర్‌ఎంతో పాటు ఏడీఆర్‌ఎం (ఇన్‌ఫ్రా) ఇ. శాంతారాం , కమర్షియల్, ఇంజినీరింగ్, మెకానికల్, ఎలక్ట్రికల్, ఆపరేషన్స్, సెక్యూరిటీ , సిగ్నల్ అండ్ టెలికాం విభాగాల అధికారులు, స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు.